# పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ

**● మోదీ ప్రశంసలు స్ఫూర్తినిచ్చాయి ● 'ఈనాడు-ఈటీవీతో' తితిదే ఆరోగ్య, పారిశుద్ధ్య విభాగం అధికారి శర్మిష్ఠ**



ఈనాడు, తిరుపతి

"తిరుమల పేరు చెబితే శ్రీవేంకటేశ్వర స్వామి గుర్తుకొస్తారు. ప్రతి రోజు వేల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. అందుకే తిరుమలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇటీవలే దేశ ప్రధాని నరేంద్రమోదీ సైతం ఇక్కడి పరిశుభ్రత పద్ధతులను ప్రస్తుతించారు. ప్రధాని సందేశం ఎంతో స్ఫూర్తినిచ్చింది. బ్రహ్మోత్సవాల సమయంలో సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామ'ని తిరుమల, తిరుపతి దేవస్థానం ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ఠ'' పేర్కొన్నారు. సామాన్య భక్తులు అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సోమవారం ఇక్కడ 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు....

## అదనపు సిబ్బంది..

సాధారణంగా తిరుమలలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు 2500 మంది సిబ్బంది నిత్యం విధుల్లో ఉంటారు. బ్రహ్మోత్సవాల కారణంగా ప్రస్తుతం వారికి అదనంగా మరో 700 మందిని తీసుకున్నాం. మొత్తం మూడు షిఫ్టుల్లో వీరు పని చేస్తుంటారు. దివ్యక్షేత్రంలో ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం కన్పించకుండా నిరంతరం పనులు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఉన్న 2500 మంది సిబ్బందిలో 40 శాతం, 40 శాతం, 20 శాతం నిష్పత్తి చొప్పున వినియోగిస్తూ వచ్చే వాళ్లం. ఇప్పుడు ప్రతి షిఫ్టులో 30, 30, 40 శాతం మంది సిబ్బంది నియమించి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్నాం.

## అక్కడ ప్రత్యేక దృష్టి

సాధారణంగా ఎక్కువ శాతం మంది భక్తులు కల్యాణకట్ట, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, యాత్రి సేవా సదన్లు, అన్నప్రసాద కేంద్రాల వద్ద ఉంటారు. ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎక్కువ మంది సిబ్బందిని ఆయా ప్రాంతాలకు కేటాయించాం. రహదారుల పక్కన చెత్త వేసేందుకు అనువుగా ఎక్కడికక్కడ విడివిడిగా రెండు చెత్త డబ్బాలు ఏర్పాటు చేశాం. భక్తులు వాటిని పరిశీలించి తడి, పొడి వ్యర్థాలు వేర్వేరుగా వేయడం వల్ల వాటి పునర్వినియోగానికి ఆస్కారం ఉంటుంది.

## రాత్రి వేళల్లో ఎక్కువ....

ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలతోపాటు గ్యాలరీల్లోనూ భక్తుల సంఖ్య సాయంత్రం తర్వాత అధికంగా ఉంటుంది. రాత్రివేళ వాహన సేవలు పూర్తయిన తర్వాత భక్తులు అక్కడి నుంచి ఖాళీ చేస్తుంటారు. రాత్రి భక్తులు అందరూ వెళ్లిపోయిన తర్వాతే అక్కడ చెత్తను తొలగించేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదయం మళ్లీ సేవలు చూసేందుకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా రాత్రి పూట సిబ్బందిని ఎక్కువగా నియమించాయి. గ్యాలరీల్లో రాత్రి సమయంలోనే పనులు చేస్తున్నారు. మొత్తంగా బ్రహ్మోత్సవాల వేళ ఎక్కడా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాం.